క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బొమ్మూరులో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: రెండు దశాబ్దాల క్రితం ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం పేరిట ఒక చోటకు చేరి, అప్పటి స్మృతులను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. బొమ్మూరులోని ఏఎంజీ జూనియర్ కళాశాలలో 2002–04 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కళాశాల ఆవరణలో ఘనంగా జరిగింది. అప్పటి నిక్ నేమ్‌లు, అల్లరి చేష్టలను గుర్తు చేసుకుంటూ తమ స్నేహబంధాన్ని చాటుకున్నారు. తమ ఉన్నతికి కృషి చేసిన లెక్చరర్లను సత్కరించారు. స్నేహితులందరినీ ఒకచోట చేర్చిన ర్యాలీ బాబ్జీరావు, సత్యనారాయణ, భాస్కర్, శ్రీకాంత్, భార్గవిని అభినందించారు.

పేదలు, వృద్ధులకు దుప్పట్ల వితరణ

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి వెంకటగిరిలో సోమవారం భోగి పండగ సందర్భంగా జనకల్యాణ్ భారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే వెంకటగిరి ఏరియాలో అనారోగ్యంతో బాధపడుతున్న కొందరికి వారి ఇళ్లకు వెళ్లి దుప్పట్లు, నిత్యావసర వస్తువులు, మందులు, చేతికర్రలు పంపిణీ చేశారు. ట్రస్టు ప్రతినిధులు ఆర్.శ్రీసూర్య రాజకుమార్, తాడి కోటేశ్వరరావు, కరుటూరి శ్రీనివాస్, టి.సూర్యభాస్కర్, మల్లాది సుబ్రహ్మణ్యం, ఆర్.సుబ్బరాజు, రామోజు కుసుమ, ఎ.శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు. ప్రతి శుక్రవారం ట్రస్ట్ ద్వారా పేదలకు వెంకటగిరిలోని రిమ్మలపూడి సుబ్బరాజు ఇంటి వద్ద భోజన వితరణ చేస్తున్నట్లు ట్రస్ట్ ప్రెసిడెంట్ రాజకుమార్ తెలిపారు.

వృద్ధులకు నూతన వస్త్రాల వితరణ

భోగి, సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజేంద్రనగర్ దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బొమ్మూరులోని వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో సోమవారం వృద్ధులకు నూతన వస్త్రాలు, పండ్ల వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, అధ్యక్షుడు అల్లంకి మణికంఠ, కార్యదర్శి ఆశపు శ్రీనివాస్, కోశాధికారి రెడ్డి భీమేష్, మాజీ కార్పొరేటర్ బళ్లా సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



గాడి గోపీనాథ్(ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: ఆటోనగర్ వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గాడి గోపీనాథ్(38) ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల మేరకు, ఈ ప్రమాదంలో అతడి భార్య మేఘన(34) మృతిచెందిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన గోపీనాథ్‌ను రాజమహేంద్రవరం జీజీహెచ్ వైద్యుల సిఫార్సుతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు.

తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు

సీతానగరం మండలం ముగ్గళ్లకు చెందిన గోపీనాథ్ దివాన్‌చెరువులోని ప్రైవేటు స్కూల్లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఐదేళ్ల నుంచి దివాన్‌చెరువులో భార్య మేఘన, కుమార్తె పవిత్ర, కుమారుడు సుశాంత్‌తో ఉంటున్నాడు. రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోవడంతో పవిత్ర, సుశాంత్ తీవ్రంగా రోదిస్తున్నారు. తల్లిదండ్రులు లేని లోటు వారికి ఎవరు తీరుస్తారంటూ బంధువులు పడుతున్న వేదన చూపరులను కలచివేస్తోంది.



లాలాచెరువు గోవింద క్షేత్రంలో సోమవారం రాత్రి జరిగిన గోదా రంగనాథుల కల్యాణం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న గంగిరెద్దుల వాళ్లు



రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి ఇంటి వద్ద..



భోగి వేడుకల్లో వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ కో–ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్



రాజమహేంద్రి మహిళా డిగ్రీ కళాశాలలో వేడుకలు ప్రారంభిస్తున్న డాక్టర్ కర్రి రామారెడ్డి

మిన్నంటిన భోగి సందడి

- తెల్లవారుజామునే భోగి మంటలు
- పిడకల దండలు వేసేందుకు పోటీ పడ్డ యువత
- ప్రముఖుల ఇళ్ల వద్ద వేడుకలు

సీటీఆర్ఐ: అచ్చమైన తెలుగు వారి పండగలైన భోగి, సంక్రాంతి వేడుకలు అంబరాన్నంటాయి. సోమవారం నగరంలో పలుచోట్ల భోగి మంటలు ఏర్పాటు చేశారు. వాటిలో వేయడానికి పిడకలతో యువత పోటీ పడ్డారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి ఇంటి వద్ద భోగి వేడుకలు జరిగాయి. అలాగే వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ కో–ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ భోగి వేడుకలు నిర్వహించారు. రాజమహేంద్రి మహిళా జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలల ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కాలనీ మైదానంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ప్రముఖ మానసిక వైద్యుడు కర్రి రామారెడ్డి భోగి మంట వెలిగించి సంబరాలను ప్రారంభించగా, రాజమహేంద్రి విద్యా సంస్థల చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు. గురప్ప స్వామీ, ఎద్ల బండ్లు, గంగిరెద్దుల ప్రదర్శన, హరిదాసుల సంకీర్తన ఆకట్టుకున్నాయి. ముగ్గుల పోటీల విజేతలకు మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ నాయకుడు గన్ని కృష్ణ, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, సీపీఐ నేత మధు బహుమతులు అందజేశారు. స్థానిక క్వారీ మార్కెట్‌లోని బీజేపీ కార్యాలయం వద్ద భోగి వేడుకలు జరిగాయి.



రాజమహేంద్రవరంలోని లలితా నగర్‌లో హరిదాసుకు బియ్యం పోస్తున్న యువతులు

సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలి

రాజమహేంద్రవరం రూరల్: సంక్రాంతి పండగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు అన్నారు. సోమవారం హుకుంపేట డిబ్లాకు గౌతమీనగర్‌లో ఓబీసీమోర్చా జిల్లా ఐటీసెల్ కన్వీనర్ పట్నాల నాగార్జున ఆధ్వర్యంలో భోగి సందర్భంగా అంగనవాడీ కేంద్రంలోని చిన్నారులకు భోగిపండ్లు వేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, అంగన్‌వాడీ కేంద్రానికి విద్యా, క్రీడా సామగ్రి, ఫ్యాన్‌ను అందజేశారు.

సినిమాలు



శ్యామల	: సంక్రాంతికి వస్తున్నాం
సూర్య మినీ	: గేమ్ ఛేంజర్
సూర్య ప్యాలెస్	: డాకు మహరాజ్
స్వామి	: గేమ్ ఛేంజర్
శివజ్యోతి	: సంక్రాంతికి వస్తున్నాం
అనుశ్రీ	: గేమ్ ఛేంజర్
రాజా	: సంక్రాంతికి వస్తున్నాం
ఊర్వశి	: గేమ్ ఛేంజర్
మేనక	: సంక్రాంతికి వస్తున్నాం
రంభ	: డాకూ మహరాజ్
కుమారి	: డాకు మహరాజ్
అప్సర	: డాకు మహరాజ్
అశోక	: డాకు మహరాజ్
నామవరం	
వీఎస్ మహల్	: సంక్రాంతికి వస్తున్నాం, గేమ్ ఛేంజర్, డాకు మహరాజ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: డాకు మహరాజ్, సంక్రాంతికి వస్తున్నాం, గేమ్ ఛేంజర్
కడియం	
వెంకటసూర్య	: సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహరాజ్, గేమ్ ఛేంజర్

కూటమి ప్రభుత్వంలో ప్రజలకు చిక్కులు

- జగన్ పాలనలో ఇలాంటి సందర్భాలు లేవు
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్

సీటీఆర్ఐ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ వచ్చాక ప్రజల చేతిలో డబ్బుల్లేకుండా పోయాయని, ఫలితంగా మార్కెట్లు వెలవెలబోతున్నాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాజమహేంద్రవరం మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. డైలీ ఫైనాన్స్‌లతో మళ్లీ పేద, మధ్యతరగతి కష్టాలు ఆరంభమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్ల జగనన్న పాలనలో ఇలాంటి సందర్భాలు లేవన్నారు. భోగి పండగ సందర్భంగా ఓఎన్‌జీసీ ఆఫీస్ సమీపంలోని ఆయన స్వగృహం వద్ద సంప్రదాయబద్ధంగా భోగి వేడుకలు సోమవారం ఉదయం ఘనంగా జరిగాయి. భోగిమంటలో పిడకల దండలు వేసి, హరిదాసుల సంకీర్తన, కోడిపుంజులతో సందడి చేశారు. రాష్ట్ర బీసీ నాయకులు మార్గాని నాగేశ్వరరావు, ప్రసూన దంపతులు, భరత్‌రామ్ సోదరి జ్యోత్స్న, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భరత్‌రామ్ తెలుగు రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగి రోజున భోగభాగ్యాలతో, సంక్రాంతి రోజున సుఖసంతోషాలతో, కనుమ నాడు కన్నుల పండువగా పండగ జరగాలని ఆకాంక్షించారు. అనేక సంక్షేమ పథకాలతో జగనన్న ప్రజల చేతికి డబ్బు అందించేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రజల చేతిలో డబ్బుల్లేక, రోజువారీ ఫైనాన్స్‌పై ఆధారపడే పరిస్థితి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల కాలంలోనే ఇలా ఉంటే, రాబోయే రోజుల్లో ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో లాగా అందరూ ఆనందంగా సంక్రాంతి వేడుకలు జరుపుకొనే రోజులు రావాలని ఆకాంక్షించారు. సూపర్ సిక్స్ పేరిట హామీలు గుప్పించి, ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదని, ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. అందుకే సంక్రాంతి తర్వాత ఓ కార్యాచరణతో జనంలోకి జగనన్న వస్తారని, ప్రజల పక్షాన పోరాటం చేస్తారని వెల్లడించారు.



భోగి మంట వద్ద ప్రార్థిస్తున్న మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్

దోసాలమ్మ అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామ దేవత దోసాలమ్మ అమ్మవారి సంక్రాంతి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం భజన కార్యక్రమం జరిగింది. సంక్రాంతి రోజున ప్రత్యేక పూజలు, కచేరి ఉంటాయి.



ప్రత్యేకాలంకరణలో దోసాలమ్మ అమ్మవారు

పరమశివుని అనుగ్రహం పొందిన సారంగధరుడు

- కొండపై తీర్థానికి ఏర్పాట్లు
- రెండు రోజుల పాటు నిర్వహణ

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): పెద్ద పండగ తరువాత ముఖ్యమైనది కనుమ. ఈరోజు రాజమహేంద్రవరంలోని అతి ప్రాచీనమైన గుడి వద్ద తీర్థం జరుగుతుంది. దానిని కొండమీద తీర్థంగా పిలుస్తారు. స్థానిక 47వ డివిజన్‌లోని సారంగధరేశ్వర స్వామివారి ప్రాచీన ఆలయం ఉంది. స్థల పురాణం ప్రకారం, సాక్షాత్తు పరమ శివుడు ప్రత్యక్షమై భక్తుడికి వరమిచ్చిన ప్రాంతంగా భాసిల్లుతోంది. ఇదే సారంగధరేశ్వర స్వామి ఆలయంగా పేరొందింది.

కనుమ రోజే సాక్షాత్కారం

స్థల పురాణం ప్రకారం రాజమహేంద్రిని రాజధానిగా చేసుకుని రాజరాజనరేంద్రుడు వేంగి దేశాన్ని పరిపాలించాడు. అతనికి సారంగధరుడనే కుమారుడు ఉన్నాడు. రాజరాజ నరేంద్రునికి రెండో భార్య చిత్రాంగి. ఈమె వల్ల సారంగధరుడి కాళ్లు, చేతులు తొలగించాలని రాజాజ్ఞ కావడంతో, రాజమహేంద్రి కొండపై దానిని అమలు చేశారు. దీంతో సారంగధరుడు పరమశివుడిని ప్రార్థించగా, శివుడు ప్రత్యక్షమై సారంగధరుడికి కాళ్లు చేతులు పునఃప్రసాదించారు. దీంతో పరమశివుడికి సారంగధరేశ్వరుడనే పేరు వచ్చింది. ఇదంతా కనుమ రోజు కావడంతో, ఇక్కడి ప్రజలు అదే రోజు స్వామివారికి పూజలు చేస్తారు. ఇక్కడ సారంగధరేశ్వర స్వామియే కాకుండా, బాలాత్రిపుర సుందరిదేవి, అనేక ఉపాలయాలు ఉన్నాయి. ఆలయ ప్రాంగణంలో హనుమంతుడు, గరుత్మంతుడి విగ్రహాలున్నాయి.

కొండ నుంచి సారంగ మార్గం

సారంగధరేశ్వర స్వామి గుడి నుంచి కోటిలింగాల క్షేత్రం వరకు సారంగ మార్గం ఉండేది. నిత్యం తెల్లవారుజామున రాజరాజనరేంద్రుడు గుర్రంపై కోటిలింగాల క్షేత్రానికి చేరుకుని, పరమేశ్వరుడిని పూజించే వారని ప్రచారం ఉంది. గతంలో తవ్వకాల్లో ఈ సారంగం కనిపించడంతో, దేవదాయ, ధర్మాదాయ శాఖ వారు పూడ్చివేశారు. కోట గుమ్మం, చిత్రాంగి ప్యాలెస్ నేటికీ ఆ పేర్లతో ప్రసిద్ధి చెందాయి. కాగా తీర్థం సందర్భంగా కొండపై నుంచి కి.మీ. వరకు అనేక స్టాళ్లు ఏర్పాటు చేస్తారు. రంగుల రాట్నాలు, తినుబండరాలు విక్రయిస్తారు.



విద్యుద్దీప కాంతుల్లో ముస్తాబైన ఆలయం



విశేషాలంకరణలో సారంగధరేశ్వర స్వామి



కాళ్లు, చేతులు నరికిన సారంగధరుడి విగ్రహం

అన్ని ఏర్పాట్లూ చేశాం



కనుమ రోజు స్వామి దర్శనానికి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఎన్నో ఏళ్లుగా కొండపై తీర్థం ఘనంగా జరుగుతుంది. రెండు రోజులు పాటు జరిగే ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేశాం.
– ఎస్.నాగేశ్వరరావు, ఆలయ నిర్వాహణాధికారి

ఘనంగా ఆర్యాపురం బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవం

రాజమహేంద్రవరం సిటీ: ఖాతాదారులకు సేవలు అందించడమే లక్ష్యంగా ది ఆర్యాపురం కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ నిరంతరం పని చేస్తుందని బ్యాంక్ చైర్మన్ చల్లా శంకరరావు అన్నారు. సోమవారం బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవాన్ని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1918 జనవరి 13న స్థాపించి, వంద రూపాయల భాగస్వామ్య ధనంతో బ్యాంకు లావాదేవీలు ప్రారంభించిన విశ్వేశ్వర ప్రసాద్‌రావు అంచెలంచెలుగా బ్యాంకుని అభివృద్ధి పథంలోకి నడిపించారని కొనియాడారు. ప్రస్తుతం 107వ వసంతంలోకి అడుగుపెట్టడం ఆనందదాయకమన్నారు. దాదాపు 94 వేల మంది సభ్యులు కలిగి ఉన్నామని. రాజమహేంద్రవరం, చుట్టుపక్కల ప్రాంతాల్లోనే కాకుండా, గుంటూరు, విశాఖపట్నం, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, అమలాపురం తదితర ప్రాంతాల్లో మొత్తం 16 శాఖలతో బ్యాంకు విస్తరించిందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ వైస్ చైర్మన్ పోలాకి పరమేష్, బ్యాంకు సెక్రటరీ గోడే సుధాకర్ రావు, అసిస్టెంట్ సెక్రటరీ(ఇంచార్జి) తాడేల శ్రీనివాసరావు, బ్యాంకు డైరెక్టర్లు కప్పల సూర్యప్రకాశరావు, పడాల శ్రీనివాసు, పిల్లి శ్యామ్‌కుమార్, ఎరమోతుల ధర్మరాజు, బుడ్డిగ రవి కొండలరావు, యాళ్ల వెంకటరావు, ముగిది శ్రీనివాసరావు, యెనుముల రంగబాబు, సింగంపల్లి వెంకట రామకృష్ణ, నీలపాల సూర్యసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకు వ్యవస్థాపకుని విగ్రహానికి నివాళులర్పిస్తున్న పాలకవర్గం

కూటమికి పండగ జూదం

- నియోజకవర్గంలో విచ్చలవిడిగా బరులు
- కోడిపందేల మాటున జూద క్రీడలు!
- చూసీచూడనట్టుగా అధికార యంత్రాంగం

రాజమహేంద్రవరం రూరల్: సాధారణంగా సంక్రాంతి పండగను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకుంటారు. కానీ కూటమి ప్రభుత్వం జనం బలహీనతను సొమ్ము చేసుకుంటూ, వారిని జూదరులుగా మారుస్తోంది. ఓవైపు హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, జంకూబొంకూ లేకుండా విచ్చలవిడిగా అనేక చోట్ల బరులను ఏర్పాటు చేశారు. బరుల వద్ద కోడిపందేలతో పాటు, పేకాట, గుండాట తదితర చట్టవ్యతిరేక జూద క్రీడలను కూడా నిర్వహిస్తున్నారు. కోడిపందేల మాటున జూదక్రీడలకే ప్రాధాన్యమిస్తూ, ప్రజల నుంచి బహిరంగంగా సొమ్ము దోచుకుంటున్నారు. కోడి పందేలు బరుల వద్ద ఏర్పాటుచేసిన జూదబోర్డులకు రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలు ముందుగా చెల్లించి మరీ నిర్వాహకులు ఏర్పాటు చేశారంటే, జనం వద్ద ఏ స్థాయిలో దోచుకుంటున్నారో అవగతమవుతోంది.



దుళ్ల శివారు ప్రాంతంలో కోడి పందేల జోరు

ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి..

బరులకు సంబంధించి నిర్వాహకులైన కూటమి నాయకుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి మరీ వీటిని నిర్వహిస్తున్నారంటే వీరి బరితెగింపు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి తదితర కూటమి నాయకుల ఫ్లెక్సీలతో ప్రజల బలహీనతను సొమ్ము చేసుకుంటున్నారు. అర్ధరాత్రి నుంచి పలు బరుల్లో ఈ పోటీలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం పోలీసులు కొద్దిసేపు పోటీలను నిలిపివేశారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ప్రభుత్వ పెద్దల నుంచి అనధికార ఆదేశాలు రావడంతో.. కూటమి నాయకులు రిబ్బన్లు కత్తిరించి మరీ పోటీలను ప్రారంభించి, అందులో పాల్గొన్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు

పందెంరాయుళ్ల కోసం ప్రత్యేకంగా సోఫా సెట్లు, భారీ టెంట్లు, ఫ్యాన్లు తదితర సదుపాయాలను కల్పించారు. ఒక్కో బరి వద్దకు 500 నుంచి వెయ్యి కోళ్ల వరకు తీసుకువచ్చారు. మద్యం సైతం అక్కడ ఏరులై పారింది. రూరల్ నియోజకవర్గంలోని రాజమహేంద్రవరం రూరల్ మండలంలో పిడింగొయ్యి, శాటిలైట్‌సిటీ, కాతేరు, కోలమూరు, ధవళేశ్వరం ఉప్పరకాలనీల్లోను, కడియం మండలంలోని వేమగిరి, వీరవరం, కడియపులంక, దుళ్ల, చైతన్యనగర్ ప్రాంతాల్లో భారీ బరులు ఏర్పాటయ్యాయి.

వారం రోజులుగా..

సంక్రాంతికి వారం రోజుల ముందు నుంచి గ్రామ స్థాయి, మండల స్థాయి కమిటీలు అంటూ సమావేశాలు పెట్టి హడావుడి చేసిన పోలీసు, రెవెన్యూ యంత్రాంగం అసలు వేళకు మిన్నకుండిపోయింది. భారీ బరులే అడ్డూఅదుపూ లేకుండా సాగుతుండడంతో, గ్రామగ్రామాన పేకాట బృందాలు కూడా జూదాల్లో నిమగ్నమయ్యాయి. గతంలో ఎన్నడూ చూడని విధంగా రూరల్ ప్రాంతంలో విచ్చలవిడిగా జూదానికి తెరలేపడంపై విమర్శలు వెల్లువెత్తాయి.